క్లుప్తంగా

9న గుంటూరులో యానాదుల రాజకీయ భేరి

నెహ్రూనగర్: యానాదుల పొలిటికల్ ఫోరం ఆధ్వర్యంలో గుంటూరులో ఈ నెల 9న యానాదుల రాజకీయ భేరి బహిరంగ సభ బీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు యానాదుల పొలిటికల్ ఫోరం రాష్ట్ర కన్వీనర్లు కేసీ కల్లూరు చిన పెంచలయ్య, యందేటి వెంకట సుబ్బయ్యలు తెలియజేశారు. ఈ మేరకు గురువారం అంబేడ్కర్ భవన్‌లో రాజకీయ భేరి బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పది లక్షల జనాభా కలిగిన యానాదులకు ప్రత్యే క కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఎమ్మెల్సీ పదవి కేటాయించి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బాపట్ల బ్రహ్మయ్య, కె.సూరిబాబు, పొన్నూ రు అంకమ్మరావు, మన్యం కోటయ్య, ఆర్ మధు, శ్రీనివాసులు, రాజు పాల్గొన్నారు.

మైనార్టీల మద్దతు జగనన్నకే..

నెహ్రూనగర్: క్రిస్టియన్, ముస్లిం మైనార్టీల ప్రజలు మద్దతు ఎల్లప్పుడు సీఎం వై.ఎస్.జగన్‌కే ఉంటుందని ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షు లు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు తెలియజేశారు. ఈ మేరకు అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 6న గుంటూరు నగరంలో క్రిస్టియన్, ముస్లిం మైనార్టీలతో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్నామన్నారు. కానీ తమ వ్యాఖ్యలను ఎల్లో మీడియా (ఈనాడు) వక్రీకరించి సీఎం వై.ఎస్.జగన్‌కు వ్యతిరేకంగా రాశారని మండిపడ్డారు. తమ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వక్రీకరించి వార్తలు రాస్తే ఎస్సీ, ఎస్టీ చట్ట పరంగా తగిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.

దుకాణాల్లో వరుస చోరీలు

పెదనందిపాడు: దుకాణం తాళాలు పగులగొట్టి, నగదు దోచుకెళ్లిన ఘటన పెదనందిపాడులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. పెదనందిపాడు రామాలయం ఎదురుగా ఉన్న టీ స్టాల్‌లో రూ.10వేలు, పక్కనున్న సంగం డెయిరీ పార్లర్‌లో రూ.43వేలు నగదు దోచుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. ఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్ పరిశీలించి, ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అబ్దుల్ రెహమాన్ తెలిపారు. ఈ ఘటనతో పోలీస్‌లు రాత్రిళ్లు గస్తీ పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

'కళ్లం'లో డిజిటల్ ఇంజినీరింగ్‌పై సదస్సు

గుంటూరు రూరల్: సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటూ ఉన్నత శిఖరాలను చేరాలని కళ్ళం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. ఉమాశంకర్‌రెడ్డి అన్నారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో డిజిటల్ ఇంజినీరింగ్‌పై జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి సాకేతిక పరిజ్ఞానాన్ని అవసరం మేరకు వినియోగించుకుని, ఆధునిక ప్రపంచంలో నూతన ఆవిష్కరణల దిశగా ముందుకు పోవాలని సూచించారు. హైదరాబాద్‌కు చెందిన ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ నాస్కాంకు చెందిన రీసెర్చ్ ఇంజినీరింగ్ విభాగ డిప్యూటీ డైరెక్టర్ సతీష్ దాట్ల మాట్లాడుతూ బీటెక్ మెదటి సంవత్సరం విద్యార్థులు సాంకేతిక పోటీ ప్రపంచంలో వివిధ స్కిల్ ఆధారిత కోర్సులను నేర్చుకోవడం ద్వారా, ఇంటర్న్‌షిప్ ఆధారిత ఉపాధి పొందవచ్చన్నారు. కళ్ళం ఇంజినీరింగ్ కళాశాల ఇంజినీరింగ్ కోర్సులలో ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ - నాస్కాంకి సంబంధించిన వివిధ సర్టిఫైడ్ కోర్సులను ప్రవేశపెట్టాలని తద్వారా ఉపాధి నైపుణ్యాలను పెంచుకోవచ్చని కళాశాల ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్బీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

- ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్
- రహదారులు, డ్రెయిన్ల పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

పట్నంబజారు: మౌలిక వసతుల కల్పనలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళిగిరిధర్ చెప్పారు. ఈమేరకు గురువారం నియోజకవర్గంలోని 28వ డివిజన్, ఎన్జీవో కాలనీలో పర్యటించి అకాల వర్షానికి దెబ్బతిన్న రోడ్లు, మరమ్మతులకు గురైన సైడ్ డ్రెయిన్‌లను పరిశీలించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రాంతమంతా పర్యటించి సమస్యల పరిష్కారినికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ 28వ డివిజన్‌లో రూ.5.63 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనుల టెండర్ స్టేజ్‌లో ఉన్నాయని, త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. వర్షాల కారణంగా నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్లు, కాల్వలను యుద్ధ ప్రాతిపదికన పనులు చేయించడం జరుగుతోందన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పనులు త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలో జీఎంసీ టెండర్ స్టేజీలో రూ. 60 కోట్ల అభివృద్ధి పనులున్నాయని, అవి త్వరితగతిన పూర్తి చేసేందుకు దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు మేరువ నర్సిరెడ్డి, దాసరి రమేష్, శివశంకర్, రమణారెడ్డి, మనోజ్, నగరపాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యరహిత వాతావరణంలోనే స్వచ్ఛమైన గాలి

మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ ప్రసాద్



ఎంవీఐ గంగాధర్ ప్రసాద్‌కు మొక్క అందజేస్తున్న విద్యార్థిని

గుంటూరు ఎడ్యుకేషన్: కాలుష్యానికి తావులేని వాతావరణంతోనే స్వచ్ఛమైన గాలిని పీల్చగలమని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం పట్టాభిపురంలోని టీజీపీఎస్ కళాశాలలో కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ప్రపంచ స్వచ్ఛ వాయువు దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గంగాధర్ మాట్లాడుతూ మన ఆరోగ్యం స్వచ్ఛంగా ఉండాలి అంటే వాతావరణం కలుషితం కాకుండా చూడాలని, ప్రాణ కోటికి అతి ముఖ్యమైన వాయువును శుభ్రంగా చూసుకునే బాధ్యత మనందరి పైన ఉందని పేర్కొన్నారు. వాతావరణ కాలుష్యం కలిగించే వాహనాలను ఉపయోగించవద్దని సూచించారు. ఐటీసీ పర్యావరణ సమన్వయకర్త నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి బాధ్యతగా ఇంటికి ఒక చెట్టును నాటి, పరిరక్షించాలని, అటువంటప్పుడు పరిశుభ్రమైన వాయువు సమాజానికి ఇవ్వగలుగుతామని సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ సహాయ ఇన్‌చార్జ్ సుధా కురుబ మాట్లాడుతూ చెట్లు పెంచడం, పొగ వాహనాలు తక్కువగా వినియోగించడం, పరిసరాలు శుభ్రంగా ఉంచడం వంటివి చేయడం వలన పరిశుభ్రమైన గాలి మనకు వస్తుందని, అందరం సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలి అంటే ప్రాణ వాయువును కలుషితం కాకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్స్ మనోహర్, అనితా దేవి, జాతీయ సేవా పథకం కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జె.వి.సుధీర్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

లాటరీ ఆడుతున్న నలుగురి అరెస్టు

పట్నంబజారు: సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లచెరువు మూడు బొమ్మల సెంటర్ వద్ద ఓ గదిలో సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3,200 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సెబ్, లాలాపేట పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. నలుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు

పట్నంబజారు: స్థల యజమాని సంబంధం లేకుండా అక్రమ రిజిస్ట్రేషన్‌లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసుల కథనం ప్రకారం.. చంద్రమౌళినగర్‌కు చెందిన కొమ్మినేని నాగమల్లేశ్వరి గోరంట్లలో ఉన్న తన స్థలాన్ని విక్రయించేందుకు వెంకటస్వామికి జీపీఏ చేసింది. ఈక్రమంలో వెంకటస్వామి నాగమల్లేశ్వరికి తెలియకుండా పలువురికి ఆస్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశాడు. విషయం తెలుసుకున్న నాగమల్లేశ్వరి జీపీఏను రద్దు చేయించింది. అయినప్పటికీ వెంకటస్వామి ఆస్థలాన్ని మరికొందరికి రిజిస్ట్రేషన్ చేసినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భ్రమరాంబ అమ్మవారికి లక్షగాజుల అలంకరణ

పెదకాకాని: శ్రావణ మాసం చివరి శుక్రవారం భ్రమరాంబ అమ్మవారిని లక్షగాజులతో అలంకరించి, పూజలు చేయడం జరుగుతుందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలక వర్గం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు గురువారం తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రధాన అర్చకస్వామి పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా ముత్తయిదువులకు సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళలు పూజా ద్రవ్యాలతో పాటు కలశ పాత్ర వెంట తీసుకురావాలని తెలిపారు. పూజా కార్యక్రమంలో పాల్గొనే ప్రతి మహిళకు ఆలయం నుంచి పసుపు, కుంకుమ, జాకెట్ ముక్క, అష్టలక్ష్మీ దేవి అమ్మవారి రూపు ఉచితంగా అందజేయడం జరుగుతుందని ఏసీ తెలిపారు. ప్రతి శుక్రవారం సహస్ర దీపాలంకరణ సేవ, అమ్మవారి రథోత్సవ సేవలో భక్తులు స్వయంగా పాల్గొనవచ్చన్నారు.

పర్యావరణ హిత కార్యక్రమాలకు సహకరించాలి



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది

నెహ్రూనగర్: స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ గుంటూరు నగరంలో చేపడుతున్న మొక్కల పెంపకం, పర్యావరణ హిత కార్యక్రమాలకు నగర ప్రజలు సహకరించాలని ఈఈ కొండారెడ్డి కోరారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు గురువారం నగరపాలక సంస్థ అధికారులు, వార్డ్ సచివాలయ కార్యదర్శులు ఇంటర్నేషనల్ డే ఆఫ్ క్లీన్ ఎయిర్ ఫర్ బ్లూ స్కైస్‌లో భాగంగా స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ పై నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి హిందూ కాలేజీ జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కొండారెడ్డి మాట్లాడుతూ నగరంలో వాయు స్వచ్ఛతకు నగరపాలక సంస్థ నుంచి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే వార్డు సచివాలయాల వారీగా మొక్కల పెంపకంపై కార్యదర్శులకు ప్రత్యేక కార్యాచరణ కేటాయించామన్నారు. పరిశుభ్రమైన గాలి ప్రజారోగ్యానికి, ప్రశాంత వాతావరణానికి దోహదం చేస్తుందన్నారు. నగరపాలక సంస్థ వాయు కాలుష్యాన్ని నియంత్రించే కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య విభాగంలో ఇంటింటి చెత్త సేకరణకు ఈ-ఆటోలను అందుబాటులోకి తెచ్చిందని, త్వరలో నగరంలోని అన్ని వార్డ్ సచివాలయాలకు ఈ-ఆటోలు వస్తాయన్నారు. ర్యాలీలో సీఎంఓహెచ్ డాక్టర్ విజయలక్ష్మీ, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, డీఈఈ మధు, ఏఈ దుర్గా ప్రసాద్, సచివాలయ కార్యదర్శులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులానికి ఇన్వర్టర్ల విరాళం

గుంటూరు రూరల్: అడవి తక్కెళ్లపాడు గ్రామంలోని అంబేడ్కర్ గురుకులానికి దాతలు రూ. 40 వేల విలువ చేసే ఇన్వర్టర్, బ్యాటరీలు విరాళంగా గురువారం ఇచ్చారు. రోటరీ క్లబ్ గుంటూరు వికాస్ సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పోలిశెట్టి ప్రేమ్ కుమార్ సతీమణి సీతారాణి జయంతి సందర్భంగా వారి కుమార్తె రమ్యశిల్ప వీటిని అందజేశారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రోటరీ జిల్లా పూర్వ గవర్నర్ పి.శివన్నారాయణ మాట్లాడుతూ పేద విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థితికి రావాలని కోరుకుంటున్నానన్నారు. ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, తన శ్రీమతి ప్రజాసేవలో ఎప్పుడూ ముందుండేవారని, అందు వల్లే ఆమె జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం రోటరీ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ మద్ది రాధాకృష్ణ, సెక్రటరీ మెహతాబ్ ఖాన్, కోశాధికారి రాధాకృష్ణయ్య, సభ్యులు దగ్గుపాటి సాంబశివరావు, కొత్తమాసు వెంకటేశ్వర రావు, పాలేటి సుబ్బారావు, బీవీ అప్పారావు, గురుకులం ప్రిన్సిపాల్ వెస్లీ, గురుకులం అధ్యాపక బృందం పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో విద్యుత్ విజిలెన్స్

- 56 బృందాలుగా తనిఖీలు
- 4,598 సర్వీసుల పరిశీలన
- రూ. 14.48 లక్షలు అపరాధ రుసుం

గుంటూరు ఈస్ట్: విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ సంయుక్త విభాగాల ఆధ్వర్యంలో నగరంలోని డీ-5 సెక్షన్ పరిధిలోని మంగళదాస్‌నగర్, ఇజ్రాయిల్‌పేట, గాంధీనగర్, బసవతారకనగర్, ఆర్టీసీ కాలనీ ప్రాంతాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. 56 మంది అధికారులు, 168 మంది సిబ్బంది, 56 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. 4,598 సర్వీసులను తనిఖీ చేసి అనుమతి లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 289 మందికి రూ. 14.48 లక్షలు అపరాధ రుసుము విధించారు. అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరిల్లో విద్యుత్ వాడుతున్న వ్యక్తికి రూ. 50 వేలు అపరాధ రుసుము విధించారు. అనుమతించిన లోడుకంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 253 మందికి రూ. 13.48 లక్షల అపరాధ రుసుము విధించారు. అసలు వాడకం కంటే బిల్లు తక్కువగా వచ్చిన ఐదు సర్వీసులు గుర్తించి రూ. 50 వేలు అపరాధ రుసుము విధించారు. ఈసందర్భంగా ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ టి.శ్రీనివాసబాబు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు విద్యుత్ మీటర్లకు తప్పనిసరిగా సీలు ఉండేలా నిర్ధారించుకోవాలన్నారు. సీలు లేకపోయినా, తుప్పుపట్టి ఊడినా వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. అధికారుల తనిఖీల్లో సీలు లేకపోయినా విద్యుత్ చౌర్యంగా నిర్ధారించి కేసు నమోదు చేయడం జరుగుతోందన్నారు. పనిచేయని విద్యుత్ మీటరు నుంచి విద్యుత్ వాడుకున్నా, ఉండవల్సిన మీటరు బదులు వేరే మీటరు పెట్టినా విద్యుత్ చౌర్యంగా నిర్ధారిస్తామన్నారు. మొదటిసారి తప్పిదానికి కాంపౌండింగ్ పద్ధతిలో అపరాధ రుసుము విధిస్తారన్నారు. రెండోసారి తప్పిదానికి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించడం జరుగుతోందన్నారు. అపరాధ రుసుము చెల్లించలేని పరిస్థితిల్లో రెవెన్యూ రికవరీ చట్టం ఉపయోగించి ఆస్తులు జప్తు చేయడం జరుగుతోందన్నారు. మొదటిసారి తప్పిదానికి మూడు రెట్లు, రెండో సారి తప్పిదానికి ఆరు రెట్లు జరిమానా విధించే అవకాశం విద్యుత్ చట్టంలో ఉందన్నారు. విద్యుత్ చౌర్యం జరుగుతున్నట్లు తెలిస్తే సెల్ 9440812263, 9440812360 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. దాడుల్లో డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎం.రవికుమార్, కె.రవికుమార్, పఠాన్ హుస్సేన్ ఖాన్, ఏఈలు కె.కోటేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, సిబ్బంది పాల్గొన్నారు.

చైనా గైర్హాజరు ప్రభావం ఉంటుంది

- విశ్లేషకులు, విద్యావేత్త ఇ.చంద్రయ్య
- జీ-20పై అవగాహన చర్చా గోష్టి



మాట్లాడుతున్న విద్యావేత్త ఇ.చంద్రయ్య

లక్ష్మీపురం: చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, జీ-20 సమావేశాలకు గైర్హాజరు కారడమన్నది ఈ పన్నెండేళ్ళలో ఇదే తొలిసారి, సదస్సు తీసుకోబోయే నిర్ణయాలపై ఈ ప్రభావం ఖచ్చితంగా ఉంటుందని విశ్లేషకులు, విద్యావేత్త ఇ.చంద్రయ్య అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివ రామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం చర్చా గోష్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ జీడీపీలో 85 శాతం వాణిజ్యంలో 75 శాతం జనాభాలో మూడింట రెండువంతులకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఈ సదస్సులో ఆమెరికాతో మన సాన్నిహిత్యం ఎంత హెచ్చినా, సదస్సు సందర్భంగా ఆ దేశంతో ఎన్ని వేల కోట్ల రక్షణ సామగ్రి కొనుగోళ్లు జరిగినా చైనా రష్యాలతో ముడిపడి ఉన్న మన సమస్యలకు అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వక తప్పదన్నారు. అనంతరం పలువురు సంస్థ సీనియర్ సభ్యులు చర్చలో పాల్గొని ప్రసంగించారు. సమావేశానంతరం సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి సనాతనాన్ని మలేరియా, డెంగీ, కరోనా వంటి వ్యాధులతో పోలుస్తూ నిర్మూలన గురించి పలువురు మాట్లాడటాన్ని ఖండించారు.

హస్త భూషణమే కాదు..

లక్ష్మీపురం: పుస్తకం మనోనేస్తమని, సమాజోద్ధరణకు ఊతమిస్తుందని ప్రపంచాన్ని పరిచయం చేస్తూ, నూతన ఆవిష్కరణాన్ని ఆజ్యం పోసేది పుస్తక పఠనమేనని ప్రముఖ సాహితీవేత్త ముప్పాళ్ళ ప్రసాదరావు అన్నారు. కార్యాలయంలో గురువారం జాతీయ పుస్తక పఠన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎల్ఐసీ మరింత శక్తిమంతం కావాలి

ఎల్ఐసీ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో వక్తలు



మాట్లాడుతున్న హిందూ కళాశాల ప్రిన్సిపాల్ మల్లిఖార్జున ప్రసాద్, రవీంద్ర

కొరిటెపాడు(గుంటూరు): దేశ విస్తృత ప్రయోజనాల రీత్యా ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎల్ఐసీ మరింత శక్తి వంతం కావాలని, అధికారులు, ఉద్యోగులు, ఏజంట్స్ సంఘటితంగా కృషి చేస్తూ సంస్థ అభ్యున్నతికి అకుంఠిత దీక్షతో పనిచే యాలని హిందూ కళాశాల ప్రిన్సిపాల్ పి.మల్లిఖార్జున ప్రసాద్ సూచించారు. అరండల్‌పేటలోని ఎల్ఐసి కార్యాలయంలో జరిగిన వారోత్సవాల ముగింపు సభలో గురువారం ఆయన మాట్లాడారు. 24 ప్రైవేటు కంపెనీలతో పోటీ పడుతున్న ఎల్ఐసి తన పాలసీదారులకు మరింత ఉన్నతమైన సేవలందించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. అనంతరం వివిధ పోటీలలోని విజేతలకు బహుమతులు అందజేశారు. సమావేశంలో ఎల్ఐసీ అరండల్‌పేట బ్రాంచి అసిస్టెంట్ మేనేజర్ బి.రవీంద్ర, అధికారులు ప్రసాద్, డి.సుమ, శ్రీనివాస్, రాజేంద్ర ప్రసాద్, శంకరరావు, ఉషాబాల పాల్గొన్నారు.

క్యాజువాల్టీలో సీనియర్ రెసిడెంట్లు పనిచేయాలి



వైద్యవిభాగాధిపతులతో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ క్యాజువాలిటీలో సీనియర్ రెసిడెంట్ వైద్యులు తప్పనిసరిగా విధుల్లో ఉండాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చెప్పారు. గత రాత్రి క్యాజువాల్టీలో సీనియర్ రెసిడెంట్‌లు తనిఖీలు చేసిన సమయంలో విధుల్లో లేరని తద్వారా రోగులు ఇబ్బంది పడుతున్నారని వెల్లడించారు. గురువారం సూపరింటెండెంట్ చాంబర్‌లో పలు వైద్య విభాగాధిపతులతో ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రోగుల ప్రాణాలను కాపాడేందుకు వైద్యులను,

వైద్య సిబ్బందిని పెద్ద ఎత్తున ఆసుపత్రిలో నియమిస్తున్నట్లు తెలిపారు. నూతనంగా ఉద్యోగాలు పొందిన వైద్యులు, ముఖ్యంగా సీనియర్ రెసిడెంట్ వైద్యులు ప్రభుత్వ ఆశయాలకు తగ్గట్లుగా అత్యవసర చికిత్సల కోసం ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు సత్వరమే చికిత్స అందించి ప్రాణాలు కాపాడాలన్నారు. త్వరలో తొమ్మిది సీనియర్ రెసిడెంట్ వైద్యులను ప్రభుత్వం జీజీహెచ్‌కు కేటాయించిందని, వారు విధుల్లో చేరుతారని వెల్లడించారు. సమావేశంలో డెప్యూటీ సూపరింటెండెంట్‌లు డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ గోవింద్ నాయక్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె. ఆశ సజని, అడ్మినిస్ట్రేటర్ బి.ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో డ్రెయినేజీ నిర్మాణానికి శ్రీకారం

గుంటూరు జీజీహెచ్‌లో పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగు పరుస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. మానసిక వైద్య విభాగం సమీపంలో గురువారం రూ. 40 లక్షలతో నిర్మించనున్న డ్రెయినేజీ కాల్వకు ఆయన శంకుస్థాపన చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రి లో గత పదేళ్ల నుంచి సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రోగులు వారి సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్‌లు డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ గోవింద్ నాయక్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె. ఆశ సజని తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో సాంత్వన

- పెరుగుతున్న రోగుల ఆదరణ
- నేడు ప్రపంచ ఫిజియోథెరపీ డే



జీజీహెచ్‌లో పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్ టీనా

గుంటూరు మెడికల్: శరీరంలో అన్నిరకాల నొప్పులకు ఆపరేషన్‌లతో పనిలేకుండా ఫిజియోథెరపీతో విముక్తి లభిస్తోంది. వయస్సుతో సంబంధం లేకుండా ఫిజియోథెరపీ వైద్యులు నొప్పుల సమస్యలతో బాధపడుతున్న వారు ఆధునిక చికిత్సలను అందిస్తున్నారు. వైద్య రంగం పెరిగిపోవడంతో నానాటికి ఫిజియోథెరపీ వైద్యుల పాత్ర పెరుగుతోంది. మందులతో పనిలేకుండా ఇళ్ల వద్ద కూడా ఉండి కొన్ని రకాల వ్యాయామాలు చేయటం ద్వారా చాలా రకాల నొప్పులను నయం చేయటంతోపాటుగా కొన్ని రకాల వ్యాధుల నుంచి కూడా బాధితులకు విముక్తి లభిస్తూ ఉండటంతో ఫిజియోథెరపీ పట్ల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు.

ఆపరేషన్లు చేసిన పిదప కూడా రోగి వ్యాధి నుంచి కోలుకోవటంతో ఫిజియోథెరపీ కీలకంగా మారింది. నేడు ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

అన్ని వైద్య విభాగాల్లో ఫిజియోథెరపీ సేవలు

ఒకప్పుడు ఫిజియోథెరపీ వైద్యుల సేవలు కేవలం ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో మాత్రమే వినియోగించేవారు. అనంతరం న్యూరాలజీ వైద్య విభాగంలో ముఖ్యంగా బ్రెయిన్ స్ట్రోక్ బాధితులకు పక్షవాతం నుంచి త్వరితగతిన కోలుకోవడంలో ఫిజియోథెరఫిస్టులు కీలకంగా మారారు. నేడు కేవలం ఒకటి రెండు వైద్యవిభాగాలకే పరిమితం కాకుండా అన్ని వైద్యవిభాగాల్లో ఫిజియోథెరపిస్టులు తమవంతు పాత్ర పోషిస్తున్నారు. జనరల్‌మెడిసిన్, జనరల్‌సర్జరీ, న్యూరోసర్జరీ, న్యూరాలజీ, పీడియాట్రిక్స్, గైనకాలజీ, కార్డియోథొరాసిక్ సర్జరీ, ఈఎన్‌టి, కార్డియాలజీ, క్యాన్సర్, ఇలా అన్ని వైద్య విభాగాల్లో చికిత్సలు పొందుతున్న రోగులకు ఫిజియోథెరపీ వైద్యం అవసరం ఉంటుంది. ఆపరేషన్లు చేసిన పిదప రోగి సాధారణ స్థితికి చేరుకోవాలంటే తప్పనిసరిగా ఫిజియోథెరపి చేయించాల్సిందే. క్రీడాకారులు చాలా మంది తమ వృత్తి ఎదుగుదలకు ఫిజియోథెరపిస్టుల సహాయ సహకారాలు తీసుకుంటున్నారు. పెయిన్‌లెస్ డెలివరీలు చేయటం, కాన్పు తరువాత వచ్చే కాంప్లికేషన్స్ లేకుండా నివారించటంతో నేడు ఫిజియోథెరపీ కీలకంగా మారింది. చిన్నపిల్లలో వచ్చే శారీరక ఎదుగుదల లోపాలు సరిచేయటంలో ఫిజియోథెరఫిస్టుల పాత్ర ఎంతో కీలకం.

జీజీహెచ్‌లో ఉచిత వైద్యసేవలు

కార్పొరేట్ ఆసుపత్రులకంటే దీటుగా గుంటూరు జీజీహెచ్‌లో ఫిజియోథెరపీ వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నారు. ముఖ్యంగా గుంటూరు జీజీహెచ్ డైట్ సెంటర్‌లో 19 ఏళ్ల వయస్సు లోపు వారికి వచ్చే పలు రకాల రుగ్మతలను నివారించడంలో ఫిజియోథెరపీ చాలా కీలకంగా మారింది. ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో ప్రత్యేక పిజియోథెరపీ వైద్య విభాగాన్ని ఏర్పాటు చేసి ఆసుపత్రిలో ఫిజియోథెరపీ అవసరమైన వారికి ఉచితంగా చేస్తున్నారు. పుట్టుకతోనే నడవలేని పిల్లలు, సెరిబ్రల్ పాల్సి, వెన్నుముక సంబంధిత సమస్యలు, పక్షవాతం, ఇతర సమస్యలు ఉన్నవారికి ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డైట్ సెంటర్‌లో ఉచిత సేవలు అందిస్తున్నారు.

– డాక్టర్ కొత్త టీనా, గుంటూరు జీజీహెచ్

ఫిజియోథెరపీ కీలకం

ఒకప్పుడు నొప్పి నివారణకు మాత్రమే ఫిజియోథెరపీ వైద్యసేవలను వినియోగించేవారు. నేడు ఫిజియోథెరపీ అన్ని వైద్య విభాగాల్లో కీలకంగా మారింది. ఫిజియోథెరపీ వైద్య విధానంలో ఎన్నో కొత్త వైద్య పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. క్యాన్సర్ పేషెంట్‌లకు కిమో సైడ్ ఎఫెక్ట్స్ తెలియకుండా నివారించడంలో ఫిజియోథెరపీ కీలకంగా మారింది. గ్యాస్, పొట్ట సంబంధిత సమస్యలు సైతం ఫిజియోథెరపీ ద్వారా నివారిస్తున్నారు.

– డాక్టర్ బి.నాగ సతీష్‌కుమార్, ఫిజియోథెరపిస్టు, గుంటూరు.